క్లుప్తంగా

హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి వినతి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయంలోని వసతిగృహాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.ఆర్. నాయక్ కోరారు. మంగళవారం వైవీయూలో ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డిని హాస్టల్ సమస్యలపై కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు హాస్టల్‌లో మెస్‌బిల్లు అధికంగా వస్తోందన్నారు. పెన్నాబ్లాక్‌లో తాగునీరు లేక డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జూనియర్, సీనియర్ మెస్‌లను వేర్వేరుగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లీనరీతో కార్యకర్తల్లో నూతనోత్సాహం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జాతీయ స్థాయి ప్లీనరీతో కార్యకర్తల్లో నూతన ఉత్సాహం కలిగిందని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్లీనరీ మహాసభలు చత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌లో మూడు రోజుల పాటు జరిగాయన్నారు. 2024లో కాంగ్రెస్ పార్టీ గెలుపే ప్రధానంగా ముందుకు వెళుతుందన్నారు. నరేంద్రమోదీ ప్రజా వ్యతిరేక విధానాలను నియంత్రించడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళల రక్షణే ప్రధాన ధ్యేయమన్నారు. యువత, మహిళలకు పార్టీ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ గౌడ్, సూర్యుడు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముస్లిం మైనార్టీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో నిర్వహించిన నగర మహాసభలో ఆయన మాట్లాడారు. దేశంలో ముస్లిం మైనార్టీల పక్షాన మాట్లాడే వారు కరువయ్యారని తెలిపారు. మైనార్టీలకు సంబంధించిన ఆస్తులను అక్రమిస్తుంటే నాయకులు అక్రమణదారులకు వత్తాసు పలకడం దారుణమన్నారు. ముస్లిం మైనార్టీల హక్కుల కోసం మనమందరం కలిసి పోరాడాలన్నారు. ఆప్‌కీ ఆవాజ్ నాయకులు ఆరిఫ్, షంషీర్ ఖాన్, అబిద్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.


రిపోర్టర్లపై కేసులు సరికాదు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో నలుగురు రిపోర్టర్లపై అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కదిరి పట్టణంలో రెండు రోజుల క్రితం జరిగిన హింసాత్మక సంఘటనలు అనంతరం చోటు చేసుకున్న సంఘటనలను కవర్ చేస్తున్న విలేకర్లపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రిపోర్టర్ల నుంచి సెల్ ఫోన్‌లు లాక్కొని దాడికి పాల్పడిన పోలీసులపై తక్షణమే కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

జగదీష్ న్యూరో కేర్ ద్వారా ఆధునిక వైద్య సేవలు

కడప రూరల్ : జగదీష్ న్యూరో కేర్ ఆస్పత్రి ద్వారా ఆధునిక వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆ ఆస్పత్రి న్యూరో సర్జన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేసి 10 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం సాయంత్రం ఆస్పత్రిలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు తమ ఆస్పత్రి ద్వారా 2000కు పైగా వెన్నముక, 1500కు పైగా మెదడు ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించామన్నారు. అలాగే న్యూరోకు సంబంధించి వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన పేదలకు అనుబంధ ఆస్పత్రుల్లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలను అందిస్తున్నట్లు వివరించారు. ఆస్పత్రి వైద్యులు మోహన్, మురళీకృష్ణ, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లే అవుట్ల తొలగింపు



చెర్లోపల్లెలో అక్రమ కట్టడాలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

చింతకొమ్మదిన్నె : మండలంలోని చెర్లోపల్లెలో అక్రమ లే అవుట్లను తహసీల్దార్ గంగయ్య మంగళవారం తొలగించారు. ఎక్కడెక్కడ ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు నిర్మించారో వాటిని గుర్తించి తన సిబ్బందితో తొలగించారు. లబ్ధిదారులకు ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో మాత్రమే నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఎవరైనా ప్రభుత్వ స్థలం అక్రమించి ఇళ్లను నిర్మిస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే నకిలీ పత్రాలు పొంది స్థలాలను అక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు ప్రశ్నించే తత్త్వం అవసరం

విద్యార్థుల్లో ప్రశ్నించే తత్త్వం అవసరమని.. అప్పుడే విజ్ఞానం వారి సొంతమవుతుందని పలువురు విద్యావేత్తలు అన్నారు. నగరంలోని పలు విద్యాలయాల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.



వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో జాతీయ సైన్స్ డే వేడుకలు



వైవీయూలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

వైవీయూ/ఏఎఫ్‌యూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సీవీ రామన్ ఎఫెక్ట్ ద్వారా ప్రపంచానికి భారతశాస్త్ర సాంకేతికత ప్రతిభ తెలిసొచ్చిందన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ ద్వారా జరుగుతున్న ప్రగతిని వివరించారు. జియో సైంటిస్ట్ టి. నారాయణరావు రామన్ ఎఫెక్ట్ గురించి వివరించారు. క్లోరోఫ్లోరో కార్బన్స్ ప్రభావం ఓజోన్ పొరపై ఎలా ఉంటుందో, దాని తీవ్రతను ఎలా తగ్గించాలన్న అంశాలపై సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. ఇస్రో అందించే ఫెలోషిప్స్ గురించి ఆయన వివరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు వైఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో..

కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్స్ మన దైనందిత జీవితంలో కీలకపాత్ర పోషిస్తోందని, ఆధునిక ప్రపంచంలో సైన్స్‌లేని జీవితాన్ని మనం ఊహించలేమన్నారు. సూపరింటెండెంట్ వై. పవన్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఫణీంద్రరెడ్డి, డాక్టర్ సుప్రియ, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సైన్స్ దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి. సుబ్బలక్షుమ్మ సైన్స్ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. అధ్యాపకులు జి. విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే శాస్త్ర సాంకేతిక రంగాలపై అభిరుచి పెంచుకోవాలని శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ హృద్రోగ నిపుణులు ఎండీ నవీద్ ఆహ్మద్ పేర్కొన్నారు. మంగళవారం నగరపాలక ఉర్దూ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ సైన్సు డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉత్తమ



ఇంటర్నేషనల్ డిల్లీ పబ్లిక్ స్కూల్లో ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులు

సైన్సు ప్రాజెక్టు తయారు చేసిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. పాఠశాల హెచ్ఎం పుష్పలత, పాటశాల కమిటీ చైర్మన్ చాంద్ బాషా ఉపాధ్యాయులు పాల్గొన్నారు

మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో...మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో హెచ్ఎం నాగమణి అధ్యక్షతన యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు ప్రసంగించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ డిల్లీ పబ్లిక్ స్కూల్లో...

కడప చిన్నచౌక్‌లోని ఇంటర్నేషనల్ డిల్లీ పబ్లిక్ స్కూల్లో మంగళవారం సైన్సు ఫెయిర్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ ఎం. వివేకానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రతిభను బయటకు తీసుకురావడానికి ఈ సైన్సు ఫెయిర్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ సైన్సు ఫెయిర్‌లో 3 వందల మంది విద్యార్థులు 2 వందల వైజ్ఞానిక ప్రయోగాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్‌చార్జు సందీప్ ప్రాజెక్టులను పరిశీలించారు. శివకుమార్, సంధ్యరెడ్డి, ఓబుల్‌రెడ్డి, జైచంద్ర పాల్గొన్నారు.

గురుకుల విద్యాపీఠ్‌లో...ఎన్‌జీవో కాలనీలోని గురుకుల విద్యాపీఠ్ స్కూల్లో జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏవీఆర్ విద్యా సంస్థల అధినేత వెంకటేశ్వర్లు, సీఈఓ వివేకానంద సైన్సుఫెయిర్‌ను ప్రారంభించారు. డైరెక్టర్ వీరకుమారి, పల్లవి, హెచ్ఎం మునిచంద్ర పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతిని అందచేస్తున్న ఎస్ఎంసీ చైర్మెన్ చాంద్‌బాషా



సివిరామన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, హెచ్ఎం నాగమణి



గురుకుల విద్యాపీఠ్‌లో ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డైరెక్టర్



ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థి

విజయదుర్గాలయంలో రాహుకాల పూజలు



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు నిర్వహిస్తే రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గా ప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

క్రీడలతో మానసిక ఉత్సాహం

– వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి రామసుబ్బారెడ్డి

వైవీయూ: క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉత్సాహం కలుగుతుందని వైవీయూ క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైవీయూలోని వేమన క్రీడా ప్రాంగణంలో మార్చి 9న విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య పి. పద్మ, ఆచార్య చంద్రమతీశంకర్, ఆచార్య వి. సునీత, ఆచార్య జి. పార్వతి, సరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న కె. రామసుబ్బారెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయాలకు కృషి చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డిల విజయానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చెన్నూరులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ఆర్ స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఎమ్మెల్సీ ఓటరు లిస్టులో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి వారిని కలిసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాల్సిందిగా కోరాలన్నారు. మార్చి 13న జరిగే పోలింగ్‌లో ప్రతి ఓటరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కమలాపురం నియోజకవర్గంలో దాదాపు 7181 ఓట్లు ఉన్నాయని, అలాగే చెన్నూరు మండలంలో 1100కు పైగా పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, మండలంలో అధిక మెజార్టీ వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈ విజయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలని, ఆయన మనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ జీఎన్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, రాష్ట్ర కాలుష్య మండలి సభ్యులు పాకా సురేష్, పార్టీ నేతలు ఆర్‌వీఎస్ఆర్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సచివాలయ కన్వీనర్ శ్రీనివాసరాజు నిరంజన్‌రెడ్డితోపాటు నాయకులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

తిరుమలకు పాదయాత్ర

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెంలోని కోదండ రామాలయం నుంచి ఏప్రిల్ 24న తిరుమలకు కాలినడకనవెళుతున్నట్లు ఆ గ్రామ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల భక్తులు తమ వెంట రావచ్చునని, వచ్చిన వారందరికి టిఫిన్, భోజనం ఉచితంగా కల్పిస్తామని పేర్కొన్నారు. 30వ తేదీ నాటికి తిరుమలకు చేరుకుంటామని తెలిపారు. వివరాలకు 9989493864, 9182099517 సంప్రదించాలని వారు కోరారు.

ప్రత్యేక పూజలు

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి మల్లె, జాజి, 108 నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ప్రణాళికా బద్ధంగా రైతులకు సాంకేతిక పరిజ్ఞానం



మాట్లాడుతున్న ఉద్యాన విశ్వవిద్యాలయం సంచాలకులు డాక్టర్ కరుణశ్రీ

మైదుకూరు : సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు ప్రణాళికబద్ధంగా అందించాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయం సంచాలకులు డాక్టర్ ఈ.కరుణశ్రీ అన్నారు. మైదుకూరు మండలం వనిపెంటలోని కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఆరో శాస్త్రీయ సలహాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అందించడంలో వ్యవసాయ సంబంధిత, సహాయ శాఖల, పరిశోధనా సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. పంటల సాగులో సాంకేతిక పరిజ్ఞానం తోడైతే రైతులు మరింత నాణ్యమైన దిగుబడులను సాధిస్తారని పేర్కొన్నారు. అనంతరాజుపేట ఉద్యాన పరిశోధన కేంద్రం ముఖ్య శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ కేటీవీ రమణ మాట్లాడతూ ఉద్యాన పంటలకు పేరు గాంచిన రాయలసీమలో ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. పులివెందుల అరటి పరిశోధనా కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ టి.సుశీల మాట్లాడుతూ అరటికి విలువ జోడించే విధానాల్లో శిక్షణ కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని అన్నారు. నాబార్డు డీడీఎం విజయ విహారి మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రాజెక్టులను రూపొందిస్తే తమ బ్యాంకు ఆర్థిక సహకారం అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కడప ఏరువాక కేంద్రం అధిపతి టి.మురళీకృష్ణ, ఊటుకూరు పరిశోధనా కేంద్రం ముఖ్య శాస్త్రవేత్త జాన్సన్, ఆత్మ పీడీ పద్మలత, బి.మఠం ఫిషరీస్ అధికారి బాలకుమార్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి ఆర్. సుధాకర్, వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న, లీడ్ బ్యాంకు మేనేజర్ దుర్గా ప్రసాద్, సెరికల్చర్ అధికారి వెంకట్రామ రాజు, వనిపెంట కేవీకే అధిపతి శ్రీవిద్యారాణి, శాస్త్రవేత్తలు మానస, హర్షిత, ఫిరోజ్ హుస్సేన్, అభ్యుదయ రైతులు బీపీ ప్రతాప్‌రెడ్డి, బాలనరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని మోక్షగుండం వీధి ఓం శాంతి భవన్ నిర్వాహకురాలు బీకే.పావని బెహన్‌జీ పేర్కొన్నారు. స్థానిక మోడంపల్లెలో ఓం శాంతీల ఆధ్వర్యంలో మంగళవారం ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనా దర్శన ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరికి శివపరమాత్ముని ద్వాదశ జ్యోతిర్లింగాలను ఒకే చోట దర్శించుకునేందుకు దేశంలోని పలు ప్రాంతాల్లో కొలువై ఉన్న జ్యోతిర్లింగాల నమూనాలను ఏర్పాటు చేశామన్నారు. నటరాజ కళాక్షేత్రం విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

జ్యోతిర్లింగాలను దర్శించుకున్న ఎమ్మెల్యే

ద్వాదశ జ్యోతిర్లింగాలను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఓంశాంతీలు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఓంశాంతీలు ఆరతి, జయంతి, జ్యోతి, రామకృష్ణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దే

– ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

పులివెందుల : ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడారు. కన్వీనర్లు, గృహ సారథులు, జేసీఎస్ మండల ఇన్‌చార్జిలు, మండల కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ సమష్టిగా పనిచేయాలన్నారు. మళ్లీ అధికారం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ తర్వాత «మా నమ్మకం నీవే జగనన్న» అనే క్యాంపెయిన్‌ను పార్టీ లాంచ్ చేస్తుందన్నారు. ఈ క్యాంపెయిన్‌ను ప్రతి ఇంటికీ చేర్చాల్సిన బాధ్యత కన్వీనర్లు, గృహ సారథులు, జేసీఎస్ మండల ఇన్‌చార్జిలు, మండల నాయకులపైన ఉందన్నారు. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని నిత్యం దుష్ప్రచారాలు చేస్తోందన్నారు. ఆ దుష్ప్రచారాలను మనమంతా కలిసికట్టుగా తిప్పి కొట్టాలన్నారు. ఒక అబద్ధాన్ని ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని వందసార్లు చెప్పి నిజం చేయాలనే సిద్ధాంతంతో టీడీపీ ఉందన్నారు. మన ప్రియతమ నాయకులు తాను నమ్మిన సిద్ధాంతం ఇచ్చిన మాట నిలబెట్టుకుని ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లాలనే సిద్ధాంతం అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని మన జగనన్న అమలు చేయడం జరిగిందన్నారు. దివంగత వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలు ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ ఆయన మరణానంతరం వచ్చిన ప్రభుత్వాలు నీరుగార్చాయన్నారు. మన జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత తిరిగి ఆ పథకాలను పునరుద్ధరించడమే కాకుండా అమ్మ ఒడి, వసతి దీవెన, రైతు భరోసా వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. గండికోట ప్రాజెక్టులో గతంలో 5 నుంచి 6 టీఎంసీల నీరు మాత్రమే ఉండేదన్నారు. మన జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక 27 టీఎంసీల నీరు నిల్వ చేసుకున్నామన్నారు.

‘ప్రీతి’ మరణానికి కారకులైన వారిని శిక్షించాలి

కడప కల్చరల్ : వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలకు చెందిన మెడికో డాక్టర్ ప్రీతి మరణానికి కారణమైన సైఫ్‌తోపాటు మిగతావారిని కఠినంగా శిక్షించాలని కడప నగరానికి చెందిన ఎల్ఐసీ యూనియన్ శ్రామిక మహిళా విభాగం డిమాండ్ చేసింది. సంస్థ కన్వీనర్ అమీనా పర్వీన్, కో కన్వీనర్లు శ్రీవాణి, వసుప్రద, పద్మజ, లత ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ సమూహాల నుంచి లక్షకు ఒకరు కూడా వైద్య విద్య వరకు రారని, ఎంతో భవిష్యత్తు ఉన్న డాక్టర్ ప్రీతిని ర్యాగింగ్ భూతం బలిగొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెషనల్ కళాశాలల్లో జూనియర్లను సీనియర్లు వేధించడం నివారించాలన్నారు. ప్రీతి కేసు విషయం తేల్చడమే కాకుండా తెలంగాణ ప్రభుత్వం ర్యాగింగ్ పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. గత ఐదేళ్లలో 150 మంది మెడికోలు ఆత్మహత్యలు చేసుకున్నారంటే ప్రొఫెషనల్ కళాశాలల పరిస్థితి ఏమిటో అర్థమవుతోందని, అక్కడి పరిస్థితులను చక్కబెట్టే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా జేవీవీ ఉత్సవాలు



జేవీవీ ప్రతినిధుల ఇంద్రజాల ప్రదర్శన

కడప కల్చరల్ : జాతీయ సైన్స్‌డే, జేవీవీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లాశాఖ మంగళవారం కడప నగరంలో పలు కార్యక్రమాలు చేపట్టింది. స్థానిక రవీంద్రనగర్‌లోని విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులతో ఉత్సాహభరితంగా పలు ప్రయోగాలను చేయించింది. సీనియర్ నాయకులు, సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా పాఠశాల వద్ద జేవీవీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన సంస్థ ఆవిర్భావం, ఆశయాలు, కార్యక్రమాల అమలు తదితర అంశాలను వివరించారు. సంస్థ రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడారు. అనంతరం పాఠశాల సమీపంలోని యూఎస్ ఫంక్షన్ హాలులో జేవీవీ జిల్లా అధ్యక్షులు బాల బయన్న ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వశిక్ష అభియాన్ పీడీ ప్రభాకర్‌రెడ్డి, మండల విద్యాశాఖాధికారి నారాయణ, మెజీషియన్ బాల బయన్న, వెంకటేశ్వర్లు మాట్లాడారు. మెజీషియన్ల ఇంద్రజాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. జేవీవీ ప్రతినిధులు సరస్వతి, సునీత, మధుసూదన్, కరీముల్లా, కామేశ్వరమ్మ, సత్యనారాయణ, శ్రీనివాసరాజు, సువర్ణలత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

‘మను’లో ఘనంగా సైన్స్ డే

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని మను పాలిటెక్నిక్ ఉర్దూ యూనివర్సిటీలో మంగళవారం జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కడప నగరంలోని పలు పాఠశాలల విద్యార్థులు పోస్టర్ ప్రెసెంటేషన్, మోడల్ ప్రెసెంటేషన్‌లతోపాటు వీడియో కాన్సెప్ట్‌లతో హాజరయారు. ఈ కార్యక్రమానికి పవర్ గ్రిడ్ కార్పొరేషన్ రిటైర్డ్ డిప్యూటీ మేనేజర్ ఎండీ సిరాజ్ ఉద్దౌల ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సైన్సు డేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ముఖ్సిత్‌ఖాన్ సర్టిఫికెట్స్ తోపాటు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాపకులు పాల్గొన్నారు.

గండి అంజన్న సన్నిధిలో చీరల పంపిణీ

చక్రాయపేట : గండి క్షేత్రంలో వెలసిన వీరాంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం కడప నగరం రూకవారిపల్లెకు చెందిన రాజప్రకాష్, భవాని దంపతులు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించి అనంతరం 200 మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజప్రకాష్ దంపతులను సత్కరించి నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్‌లు తెలిపారు.

న్యాయవాదులు మద్దతివ్వాలి

– ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి

ప్రొద్దుటూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో న్యాయవాదులంతా తనకు మద్దతు ఇచ్చి ఓటు వేయాలని అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి కోరారు. మంగళవారం ఆయన పట్టణంలోని వివిధ కోర్టుల పరిధిలోని బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులను కలిశారు. ఎమ్మెల్సీగా విజయం సాధిస్తే అందరికి అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఫ్రెషర్స్ డే

ప్రొద్దుటూరు : స్థానిక పశువైద్య కళాశాలలో బుధవారం సాయంత్రం ఫ్రెషర్స్ డే వేడుకలను నిర్వహించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.వైకుంఠరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఎస్‌పీ ప్రేరణ కుమార్, డీన్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్య, డీన్ ఆఫ్ స్టూడెంట్ ఆఫైర్స్ డాక్టర్ జీవీ రమణ హాజరవుతారని ఆయన తెలిపారు.